RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శుక్రవారం 27.03.2026 సంపుటి : 03 సంచిక : 111 పేజీలు : 08 వెల : రూ.5


Karimnagar Friday 27.03.2026 Volume: 03 Issue 111 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

అమరావతిలో

## వరుస అగ్ని ప్రమాదాలు

### ఏపీ సీఎం చంద్రబాబు సీరియస్..



**అమరావతి:**రాజధాని అమరావతిలో వరుస అగ్నిప్రమాదాలు జరిగిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస అగ్ని ప్రమాదాల గురించి మంత్రి నారాయణను ప్రశ్నించారు. మున్సిపల్ శాఖ మంత్రిగా మీకు బాధ్యత లేదా అని ప్రశ్నించారు. వరుస అగ్నిప్ర మాదాలు ఎందుకు జరుగుతున్నాయో, విచారణ చేయాల్సిన బాధ్యత మున్సిపల్ శాఖపై ఉందన్నార. పైపులు ఎలా దగ్ధమయ్యాయో తెలుసు కోవాల్సిన అవసరం ఉందని, అగ్నిప్ర మాదాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు . రాజధానిలో రూ.వేల కోట్ల పనులు జరుగుతుంటే, ఇలాంటి ప్రమాదాలు జరగడం మంచిది కాదన్నారు. కనీసం సీసీ కెమెరాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. కుట్రలు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# అసెంబ్లీతో ఆటలా?

రాష్ట్రంలో అనేక ప్రజాసమస్యలను పక్కనబెట్టి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించడం విడ్డూరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఒకవైపు సభలో పద్దులపై చర్చ జరుగుతున్నదని, ఆ చర్చను పక్కనబెట్టి ఆటలాడించాలని ప్రభుత్వం భావించడం భావ్యం కాదని, సమావేశాల నిర్వహణపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు.



**ప్రజాసమస్యలు పక్కన పెట్టి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడలా?**

**చర్చను పక్కదోవ పట్టించేందుకే ప్రభుత్వం ఎత్తుగడ**

**సంక్షోభ సమయంలో ఇదేం బాధ్యతారాహిత్యం?: కేటీఆర్**

**హైదరాబాద్, మార్చి 26 :** రాష్ట్రంలో అనేక ప్రజాసమస్యలను పక్కనబెట్టి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీలు పెట్టాలని ప్రభుత్వం నిర్ణ యించడం విడ్డూరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండి పడ్డారు. ఒకవైపు సభలో పద్దులపై చర్చ జరుగుతున్నదని, ఆ చర్చను పక్కనబెట్టి ఆటలాడించాలని ప్రభుత్వం భావించడం భావ్యం కాదని, సమావే శాల నిర్వహణపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. దీనిపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వద్ద సరైన సమాధానం లేదని దయ్యబట్టారు. అనేక అంశాలపై సభలో చర్చించాల్సి ఉన్నదని, ఇరిగేషన్ వంటి పద్దులపై లోతుగా చర్చ జరుగాల్సి ఉన్న దని తెలిపారు. కానీ, సభలో ఆయా పద్దులపై నిర్మాణాత్మకమైన చర్చ జరుగకుండా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. తూతూమంత్రంగా సభను నడుపుతున్నదని అభ్యంతరం వ్యక్తంచే శారు. మంత్రులే చర్చల్లో ఉండటం లేదని విమర్శించారు. ఈనెల 28, 29 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆటల పోటీలు పెడుతామని ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అయితే సభలో తమ సమస్యలపై గొంతెత్తుతారని భావించిన ఎమ్మెల్యేలు మైదానాల్లో ఆటలాడు కుంటున్నారంటే ప్రజలు హర్షించబోరని పేర్కొన్నారు. కాలయాపన కోసమే ప్రభుత్వం ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్టు కనిపిస్తున్నదని తెలిపారు. సభలో అర్థవంతమైన చర్చను బీఆర్ఎస్ కోరు కుంటుందని, ప్రతిపక్షాలు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం చేతకాక సభ నుంచి తప్పించుకోవడానికి సర్కార్ ఆటలపోటీలు పెడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు.

నేడు అన్ని రాష్ట్రాల సీఎంలతో

## ప్రధాని సమావేశం



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం దేశంలోని అన్ని రాష్ట్రాలు, యూటీల ముఖ్య మంత్రులతో సమావేశం కానున్నారు. సాయంత్రం 6. 30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ దారా ఆయన పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, తద్వారా భారత్‌పై దాని ప్రభావం, ముఖ్యంగా ఎల్పీజీ, చమురు సరఫరా కొరతకు సంబంధించిన అంశాలపై సీఎంలతో చర్చిస్తారు. ముఖ్యంగా వీటి సరఫరాలో కొరత కారణంగా రాబోయే రోజుల్లో ఎదురయ్యే గడ్డు పరిస్థితులపై, సన్నద్ధతా చర్యలపై ఈ సమావేశం దృష్టిపెడుతుంది. అంతేకాక సప్లయి చైన్స్, ఎనర్జీ భద్రత, విదేశాల్లో ఉంటున్న భారతీయల భద్రత తదితర అంశాలను కూడా ఇందులో చర్చిస్తారు. కాగా, కోడ్ ఆఫ్ కండక్ట్ కారణంగా ప్రస్తుతం ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలు ఈ సమావేశంలో పాల్గొనవు. అయితే ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యద ర్శులతో క్యాబినెట్ సెక్రటేరియేట్ సమావేశమై తగు సూచనలు, ఆదేశాలను అందజేస్తుంది.

**చట్టాన్ని కాపాడాల్సిన ఖాకీలే**

## ఉల్లంఘన?

**కరీంనగర్‌లో దారుణ ఘటన**

6లో..

## బోధనాస్పత్రులు అధికారుల చేతికి..

**ఇందుకు ప్రత్యేకంగా ఓ విభాగం ఏర్పాటు**

**డాక్టర్లకు కేవలం చికిత్సలు, రోగుల బాధ్యతే**

**టీచింగ్ కాలేజీలకూ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్**

**అక్కడి ప్రొఫెసర్లు సర్జరీలు చేస్తే ఇన్సెంటివ్‌లు**

**విద్య, వైద్యానికి ఒక్క రూపాయి కూడా కోత పెట్టం**

**శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



6లో..

ప్రభుత్వ ఆస్పత్రులు, వాటి అనుబంధ వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యతను గ్రూప్-1, 2 అధికారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శాసనసభలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు.

## ఇక రిజిస్ట్రేషన్‌తో పాటు సర్వే మ్యాప్

**ఏప్రిల్ 2 నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్**

**భూభారతి కింద ప్రయోగాత్మకంగా అమలు**

**28, 30, 31 తేదీల్లో రాత్రి వరకు రిజిస్ట్రేషన్లు**

**ఇబ్బందులు గుర్తించాక మార్పులుచేర్పులు**

**ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి**

**ఒక్కక్లిక్‌తో వివరాలు: మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, మార్చి26 :** ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్‌ను అందజేస్తామని, ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 2 నుంచి ఎంపిక చేసిన ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నారాయణ పేట జిల్లా కోస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కూసుమంచి, కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో దీన్ని అమలు చేస్తామని తెలిపారు. తొలిదశలోని ఇబ్బందులను గుర్తించి, అవసరమైన మార్పులు చేశాక ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తామన్నారు. ఈ నూతన విధానం వల్ల ఒకే క్లిక్‌తో భూముల వివరాలన్నీ తెలుస్తాయని, సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అన్నీ సేవలు ఒకే గొడుకు కిందకు వస్తాయని, ప్రతి సర్వే నంబరుకు భూధార్ నంబరు ఉంటుందని వివరించారు. రైతులకు పారదర్శకమైన సేవలను అందించడమే లక్ష్యంగా భూ పరిపాలనలో ఈ విధానాన్ని నూతన శకంగా అభివర్ణించారు. సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. భూ పరిపాలన సేవలను వేగవంతంగా అందిం చేందుకు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చేలా భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు వివరించారు. ప్రతి భూ లావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను అమలు చేయడం వల్ల భూ వివాదాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఐదు మండలాల్లో ప్రతి సర్వే నంబరుకు భూధార్ కార్డు కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి భూధార్ నంబరును కేటాయించినట్లు చెప్పారు. ఆధార్‌తో అనుసం ధానమైన మొబైల్ నంబరు ద్వారా లాగిన్ అయ్యాక అవసరమైన సమాచారం లభిస్తుందన్నారు. సర్వేకు సంబంధించిన సేవలు, సవరణలు, అప్పీళ్లు, రిజిస్ట్రేషన్ సేవలు, సిటిజన్ డ్యాష్‌బోర్డుకు సంబంధించి మై ల్యాండ్ పోర్టుపోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్స్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్ బ్యాక్ వ్యవస్థ, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నంబర్లు, దరఖాస్తుదారు వివరాలు, మ్యుటేషన్, ఈసీ, మార్కెట్ విలువలు, విలేజ్ మ్యాప్, సర్వే నంబర్ల వారీ మ్యాప్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్,, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతిదశలో సంబంధిత వివరాలు సంక్షిప్త సందేశం ద్వారా తెలియజేస్తామన్నారు.

### ఆలస్యం కాకముందే

# త్వరగా తేల్చండి



**ఒప్పందంపై ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక**

**అమెరికాతో ప్రత్యక్ష చర్చల ప్రసక్తి లేదు**

**ఒప్పంద ప్రతిపాదనలపై ఇరాన్**

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా యుద్ధంలో కాల్పుల విరమణపై ఇప్పట్లో ఒప్పందం కుదిరే అవకాశం కనపడడం లేదు. ఇరాన్‌తో మధ్యవర్తులు చర్చిస్తున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా అటువంటిదేమీ లేదంటూ ఇరాన్ తేల్చేసింది. తాజాగా, గురువారం ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీచేశారు. తాను అందజేసిన శాంతి ప్రతిపాదనలను తీవ్రంగా పట్టించుకోవాలని ట్రంప్ గురువారం హెచ్చరించారు. ఇరాన్‌ను నాసిరకం యోధులు, గొప్ప సంధానకర్తలుగా అభి వర్ణిస్తూ చర్చల కోసం ఇరానే వేడుకుం టున్నదని ట్రంప్ చెప్పారు. ఇరాన్‌తో యుద్ధంలోకి ప్రవేశించిన తర్వాత మొదటిసారి క్యాబినెట్ సమావేశంలో పాల్గొనడానికి ముందు విలేకరులతో ట్రంప్ మాట్లా డుతూ యుద్ధానికి దౌత్యపరమైన పరిష్కారం కోసం తపిస్తున్నది ఇరానే తప్ప అమెరికా కాదని చెప్పారు. టెహ్రాన్ నుంచే ఒత్తిడి వస్తున్నదని ఆయన వ్యాఖ్యా నించారు. ఒప్పం దం చేసుకునేది వాళ్లే(ఇరా న్) తప్ప నేనుకాదు అని ఆయన చెప్పారు. కాగా, ఇరానియన్ సంధానకర్తలు చాలా భిన్నంగా, విచిత్రంగా ఉన్నారు. సైనిక పరంగా పూర్తిగా నాశనమై మళ్లీ పుంజుకునే అవకాశం లేని కారణంగా వారు ఒక ఒప్పందం కోసం మమల్ని వేడుకో వాలి. అయినప్పటికీ వారు కేవలం మా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని బహి రంగంగా చెబు తున్నారు. అది తప్పు అంటూ ట్రంప్ వ్యాఖ్యానిం చారు. ఆలస్యం కాక ముందే వాళ్లు త్వరగా మేల్కొనాలి. ఎందుకంటే ఒకసారి అలా జరిగితే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. దాని పర్యవ సానం మాత్రం బాగుం డదు అంటూ ఇరాన్‌ని ఆయన హెచ్చరించారు. అయితే అమెరికాతో ప్రత్యక్ష చర్చలు జరిపే ప్రసక్తి లేదని ఇరాన్ స్పష్టం చేసింది. మిలిటరీ స్థావరాల నుంచి అమెరికా సైనికులు పారిపోతు న్నారని, గల్ఫ్ దేశాల్లోని హోటల్స్, కార్యాలయాల్లో దాక్కుంటున్నారని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి అన్నారు. 'యుద్ధం మొద లైనప్పటి నుంచి అమెరికా సైనికులు జీసీసీ (గల్ఫ్ దేశాల కూటమి) దేశాల్లో పౌర లను మానవ కవచాలుగా వాడుకుంటున్నారు. వినియో గదారులకు ప్రమాదం కలుగుతుందని మిలిటరీ ఆఫీసర్లకు అమెరికా హోటళ్లు బుకింగ్‌లు నిరాకరి స్తున్నాయి. జీసీసీ హోటల్స్ కూడా అలాగే వ్యవహరించాలి' అని అన్నారు.

## పోలీస్ శాఖలో ప్రమోషన్ల అంశంపై

# అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

**వరంగల్ జిల్లా ప్రతినిధి : జనోదయ**

పోలీస్ శాఖలో ప్రమోషన్ల అంశంపై అసెంబ్లీలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు ప్రస్తావించారు. ప్రమోషన్ల విషయంలో మల్టీజోన్-1, జోన్-2 వల్ల హైదరాబాద్, సైబరాబాద్ రేంజ్లో ఉన్న వారికి వేకెన్సీలు ఎక్కువ ఉంటాయి కాబట్టి తొందరగా ప్రమోషన్లు వస్తాయని, వీరు డిఎస్పీలు, సీఐలు కాగానే సేమ్ బ్యాచ్ లో ఉన్న వారు సెల్యూట్ కొట్టడం చాలా ఇబ్బందిగా ఉంటుందదన్నారు. గతంలో తన పోలీస్ శాఖలో పనిచేశానని, ఈ అంశంపై గతంలో మాజీ ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేశామని, ప్రస్తుతం రేవంత్ రెడ్డిని కలిసి కూడా వినతిపత్రం అందజేశామని, ట్రైనింగ్ నుండే సీనియార్టీని ఫిక్స్ అప్ చేస్తే, మహారాష్ట్ర, చెన్నై లాగా తీసుకొని ప్రమోషన్ చూస్తే బాగుంటుందని, ఈ అంశం యొక్క ఫైల్ పెండింగ్లో ఉందని, వెంటనే అంశంపై ప్రత్యేక చొరవ తీసుకోవా లన్నారు. ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్షన్ అయ్యే కానిస్టేబుళ్ల అంశం 2017 నుంచి పెండింగ్ ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.



## ఈ నెల 31న

## జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు

**జనోదయ, మంథని:**



తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల మే రకు, జిల్లా కలెక్టర్ అనుమతితో ఈ నెల 31న జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన,క్రీడల శాఖ అధికారి ఎ.సురేష్ తెలిపారు.మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు ఈ పోటీ లకు అర్హులు.మార్చి 31న ఉదయం 10:00 గంటలకు పెద్ద పల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల మైదానంలో పోటీలు జరుగు తాయి. ఎంపికైన క్రీడాకారులు సమయానికి హాజరు కావా లని సూచించారు.పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికేట్,పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం,3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు,తాజా కుల ధృవీకరణ పత్రం, ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో రావా లి.4వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు 01.09.2017 నుంచి 31.08.2018 మ ధ్య జన్మించి ఉండాలి. వయస్సు 31.08.2026 నాటికి పరి గణనలోకి తీసుకుంటారు.

## ఏప్రిల్ 7న ముంబైలో జరుగు

# ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయండి

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ

**జనోదయ, హనుమకొండ, మార్చి 26 :**



ఏప్రిల్ 7న ముంబైలో జరుగు ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశానికి హనుమకొండ జిల్లాలోని ప్రతి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. నయింనగర్‌లో ఎమ్మార్పీఎస్ హనుమకొండ మండల అధ్యక్షులు బొక్క రాజేష్ మాదిగ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం ఏప్రిల్ 7న ముంబైలో జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ యొక్క జాతీయ కమిటీ సమావేశానికి హనుమకొండ జిల్లాలో ఉన్న అన్ని మండలాల నుండి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు ఏప్రిల్ 7న జరుగు జాతీయ కమిటీ సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో సుంచు రజిని కుమార్ మా దిగ ఎమ్మార్పీఎస్ కార్యదర్శి ,రేణుకుంట్ల రాజేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు ,ఎర్ర రాము మాదిగ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ,ఎర్ర వంద రాజు మాదిగ ఎమ్మార్పీఎస్ డివి జన్ గౌరవ అధ్యక్షులు ,ఇమ్మడి రాజీవ్ మాదిగ ఎమ్మార్పీఎస్ 56 డివిజన్ అధ్యక్షులు ,సుంచు కార్తీక్ మాదిగ ఎమ్ ఎస్ ఎఫ్ మండల అధ్యక్షులు , సిలు వేరు కిరణ్ మాదిగ ,దామెర అరుణ్ మాదిగ ,ల్యాదేళ్ళ పవన్ మాదిగ ,కిన్నెర రాజేష్ మాదిగ ,ఎర్ర కాలి మాదిగ ,ఎర్ర రాజు మాదిగ ,మునిగాల గోపాల్ మాదిగ , విక్రమ్ మాదిగ పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

### డివైఎఫ్ఐ

**జనోదయ, మంథని :**



చలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్య క్షుడు గొర్రెంకల సురేష్‌ను మంథని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను అణచలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలని, నిరుద్యోగ భృతి రూ.4000, జాబ్ క్యాలెండర్, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువత సమస్యలను పట్టించుకోవాలని కోరారు.

## రాములోరి కళ్యాణానికి

## ముస్తాబైన శ్రీరాంనగర్ రామాలయం

### శ్రీ సీతారాముల కళ్యాణానికి ఏర్పాట్లు పూర్తి



**జనోదయ,మంథని :**

స్వస్తిశ్రీ చాంద్రమాన పర్భావ నామ సంవత్సరం చైత్ర శుద్ధ ప్రతిపద 27వ తేదీ శు క్రవారం నవమిథితి రోజున శ్రీ సీతారామ చంద్రుల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి. ఈ పుణ్య తిథిని పురస్కరించుకొని మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర ఆలయంలో సీతా రాముల కల్యాణం మహోత్సవానికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 25న నవమితిథి పునర్వసు నక్షత్ర మిధున లగ్న పుష్కరాంశ సుముహూర్తమున శ్రీ సీతారామ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించ నున్నారు. అనేక సంవత్స రాలుగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న ఈ ఆలయంలో నిర్వహించే కల్యాణం తిలకించడానికి వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏ ర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే అన్నదాన కార్యక్ర మంలో భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.



## ఎర్రబెల్లి స్వర్ణకు

## శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు

**జనోదయ, హనుమకొండ, మార్చి 26:**

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియామకం అనంతరం హనుమకొండకు విచ్చేసిన ఎర్రబెల్లి స్వర్ణను గురువారం తన నివాసంలో ఫోటో అండ్ వీడియో జర్నలిస్ట్ సొసైటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం పాటుపడుతుందని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గోకారపు శ్యామ్ కుమార్, అధ్యక్షులు సంపేట సుధాకర్, కార్యదర్శి బోళ్ల అమర్, కార్యవర్గ సభ్యులు బొడిగె శ్రీను, తోట తిరుమల్, చేతి శ్రీనివాస్, నామాని రమేష్‌లు పాల్గొన్నారు.

## నారాయణపూర్ గ్రామాన్ని

# ముంపు గ్రామంగా ప్రకటించాలి

**కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేయాలి**

**అసెంబ్లీలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**జనోదయ : గంగాధర మార్చి 26:**



చొప్పదండి నియోజకవర్గం లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసెంబ్లీలో మాట్లాడారు. ఉత్తర తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం లో నీటి సమస్య ఉందని. సమస్యను పరిష్కరించడానికి కొండగట్టు లిఫ్ట్ ఇరిగే షన్‌ను పూర్తిచేయాలని కోరారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తయితే కొండగట్టుతో పాటు, పక్కనే ఉన్న జేఎన్టీయూ కళాశాల తో పాటు పలు గ్రామాలకు తాగునీటికి ఇబ్బంది ఉండదని సభ దృష్టికి తీసుకువచ్చారు. చొప్పదండి నియోజకవర్గంతో పాటు, వేములవాడ నియోజకవర్గానికి సాగునీరు అందించే నారాయణపూర్ రిజర్వాయర్ నీటితో నింపిన క్రమంలో కట్ట కింద ఉన్న గ్రామస్తులు నిత్యం పాములు, తేళ్లు, విష కీటకాలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కట్ట ఎత్తు పెంచడంతోపాటు, నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి పరిహారం అందజేయాలని, నారాయణపూర్ కుడి కాలువను పూర్తిచేయాలని కోరారు. రామడుగు మండలంలోని మోతే రంగసాయిపల్లి, రుద్రారం గ్రామాల రోడ్డు పూర్తిగా దెబ్బతిందని. రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**జనోదయ, గీసుకొండ, మార్చి 26:**

రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.గీసుకొండ మండలం దసరు తండా గ్రామపంచాయతీ పరిధిలోని దసరు తండా, మంగళ తండా గ్రామాలలో ప్రజా పాలన--ప్రగతి 99 రోజుల ప్రణాళికలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం బుధవారం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అమృత అధ్యక్షత వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాడి రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... గాలికుంటు వ్యాధి వలన కలిగే నష్టాలు, పాడి పశువుల ప్రాధాన్యత వాటి ద్వారా మానవాళికి కలిగే లాభాలను వివరించారు.ఈ శిబిరంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడంతో పాటు, లేగదూడలు, పెద్ద పశువులకు పురుగుమందులు అందించారు. అదేవిధంగా రైతులకు 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో గీసుకొండ పశువైద్య అధికారి డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్...**

చెన్నారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సిబ్బంది హాజరును పరిశీలించారు. కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించి, రోగులకు అందుతున్న చికిత్స విధానంపై ఆరా తీశారు. ఔషధ నిల్వలను పరిశీలించి, అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంధ్యా రాణి,జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ సాంబశివరావు పాల్గొన్నారు.



# అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతపై అవగాహన

### ట్రాఫిక్ నిబంధనలపై పోలీసుల సూచనలు



**జనోదయ : మంథని :**

‘అరైవ్ అలైవ్’ కార్యక్రమం మూడవ దశలో భాగంగా అంతర్గం ఎస్ ఐ వెంకటే ఆధ్వర్యంలో కుందనపల్లిలోని ఐ ఓ సి ఎల్ డిపోలో ట్యాంకర్ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించబడం జరిగింది. ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్ హాజరై ట్యాంకర్ డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా ట్యాంకర్ డ్రైవర్లు దూర ప్రాంతాలకు ప్రయాణాలు చేసే సందర్భంలో జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని, అలసటతో డ్రైవింగ్ చేయరాదని సూచించారు. వేగ పరిమితులను పాటించడం, సీటుబెల్ట్ ధరించడం, మొబైల్ ఫోన్ వినియోగాన్ని నివారించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ట్యాంకర్ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణిస్తామని హామీ ఇచ్చారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించడంలో స్పష్టమైన చూపు ముఖ్యం

### చెన్నూరులో పోలీసుల అధ్వర్యంలో అరైవ్ అలైవ్ డ్రైవర్లకు కంటి పరీక్ష శిబిరం

**చెన్నూర్ : జనోదయ ఆర్సీ**






రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాలు మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ టౌన్ ఇన్స్పెక్టర్ బన్సీలాల్ ఆధ్వర్యంలో చెన్నూర్ బస్ స్టాండ్ ప్రాంతంలో ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని మంచిర్యాల డీసీపీ భాస్కర్ మరియు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వరులు సందర్శించి డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో స్పష్టమైన చూపు అత్యంత ముఖ్యమని, ప్రతి డ్రైవర్ సమయానుకూలంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ రూల్స్‌కి సంబంధించిన మరియు ప్రతిఒక్కరు పాటించవలసిన నిబంధనలను వారికి వివరించారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది ఆటో, టాక్సీ డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 24 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందించగా, 5 మందిని కంటి శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసి పంపించారు.వేసవిలో ప్రజలకు చల్లని తాగునీటి సదుపాయం. గాంధీ చౌక్ వద్ద డీసీపీ భాస్కర్,ఏసీపీ వెంకటేశ్వరులు సమక్షంలో చెన్నూర్ పట్టణ పోలీసులు చలివేంద్రంను ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చుట్టు ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో చెన్నూర్ పట్టణ ఎస్ఐలు శ్యాంపటేల్, సుబ్బారావు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌లో బాధితులకు న్యాయం చేయాలి

### వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్



**జనోదయ, సంగెం,మార్చి 26:**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడికి న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగేలా పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సిబ్బంది సూచించారు. సిపి గురువారం సంగెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీకి సంగెం పోలీస్ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సీపీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. అనంతరం సీపీ పోలీస్ స్టేషన్‌ను సమగ్రంగా పరిశీలించి స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ప్రజల జీవన విధానం, స్థానికంగా జరుగుతున్న నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులపై వివరాలను ఇన్స్‌పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ సిబ్బంది పనితీరు, బీట్ వ్యవస్థ, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.అనంతరం స్టేషన్‌లో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టుకు సంబంధించిన అంశాలపై రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వం లేకుండా, పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సిఐ రాజగోపాల్, సంగెం ఎస్. ఎస్. ఐ వంశీకృష్ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్ వాడీ సెంటర్‌లో అన్నప్రాసన..

**జనోదయ, కాజీపేట, మార్చి 26:**

కాజీపేటలోని 63వ డివిజన్‌లో గల అంగన్ వాడి సెంటర్లో బుధవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని టీచర్ శోభారాణి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్ వాడి సెంటర్ టీచర్ శోభారాణి అన్నప్రాసన యొక్క ప్రాముఖ్యతను పిల్లలకు, తల్లులకు కౌన్సిలింగ్ ద్వారా వివరించినారు. పోషకాహారం లోపం వలన పిల్లల ఎదుగుదల ఆగిపోవడమే కాకుండా.. వ్యాధుల బారిన పడతారని వారికి ఈ సందర్భంగా సూచించారు. తల్లులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తల్లులు స్రవంతి, గట్టమ్మ, ఝూన్సీ, పిల్లలు పాల్గొన్నారు.



# జిడికె-2ఏ గనిపై హెచ్‌ఎంఎస్ గేట్ మీటింగ్



**జనోదయ, గోదావరిఖని, మార్చ్ 26:**
సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జిడికె-2ఏ ఇంక్లైన్ నందు గురువారం గేటు మీటింగ్‌ను హెచ్ఎంఎస్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ... లైన్ మెన్ కార్మికులకు గతంలో 30ఎల్పి రెల్స్ వచ్చేవి ఇప్పుడు 40 రెల్స్ వస్తున్నా యని, అందువలన కార్మికులు పని చేయడం చాలా ఇబ్బందిగా మారింది, గతంలో లాగా 30 ఎల్పి రెల్స్ తెప్పి వ్వాలి డిమాండ్ చేశారు. విజిలెన్స్ పేరు మీద పెండింగ్ లో ఉన్న మారు పేర్ల ఫైల్స్ ని క్లియర్ చేసి వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, మెడికల్ పిట్ అయ్యి ట్రెనింగ్ కంప్లీట్ చేసినా మరియు అండర్ గ్రౌండ్ ట్రెనింగ్ కంప్లీట్ చేసినా వారికి వెంటనే ఆఫీస్ ఆర్డర్స్ ఇవ్వాలని, అండర్ గ్రౌండ్ లో పని చేస్తు సర్ఫేస్‌కి వెళ్ళిన సీనియర్ కార్మికులకు వస్తే ఒకటవ కేటగిరి ఇస్తాన్నారు, కార్మి కులకు బేసిక్ తగ్గుతుంది అందువలన కార్మికులు జీతం తగ్గడంవల్ల కార్మికులకు ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బందికి గురి అవుతున్నారని, కావున కార్మికులకు వేజ్ ప్రొటెక్షన్ ఇవ్వాలి ఇట్లా అయితే కార్మికులకు నష్టం జరగదు. సింగరేణి యాజమాన్యం కార్మికులకు నష్ట జరగకుండా చూడాలని కోరారు. ఈ మీటింగ్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ అరెల్లి పోషం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ పల్లె క్రాంతి కుమార్, జాయింట్ సెక్రెటరీ దెబ్బెట సతీష్, అర్గనైజింగ్ సెక్రెటరీ కుమార్, పిట్ కార్యదర్శులు రాంచందర్, వరప్రసాద్, జి.స్వామి, బి.సతీష్, కె.సత్తయ్య, ఖలీల్,రాహుల్, సుకుర్శియా, ఎ.సతీష్, శంకరయ్య, వి.సతీష్ తధితరులు పాల్గొన్నారు.



## భీమారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్

**జనోదయ : చెన్నూరు ఆర్సీ**
మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, సీఐ నవీన్ తో కలిసి భీమారం పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్బంగా డీసీపీ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు, స్టేషన్ భౌగోళిక పరిస్థితులు, సిబ్బంది పనీతీరు, స్టేషన్ పరిధిలో అధికంగా నమోదయ్యే కేసుల వివరాలతో పాటు, గ్రామాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి సిబ్బంది కి ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకొని, పోలీస్ స్టేషన్ రికార్డ్ లను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పెండింగ్ కేసుల పై డిసీపీ ఆరా తీయడంతో పాటు నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎస్ ఐ రాజేందర్‌ని అడిగి తెలుసుకొన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను సందర్శించాలని, మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు.

# కోల్ బెల్ట్‌లో నివసిస్తున్న వివిధ రాష్ట్రాల వారికి కుల ధృవీకరణ సర్టిఫికెట్లు ఇవ్వాలి

- తద్వారా సంక్షేమ పథకాలు అందించే వీలుంటుంది
- పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ పేరుతో ఇబ్బందులు కల్గకుండా చూడాలి
- అసెంబ్లీలో ప్రస్తావించిన రామగుండం ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్

**జనోదయ, గోదావరిఖని, మార్చ్ 26:**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో గత 50 ఏళ్ల నుంచి కూలీలుగా పనిచేస్తున్న ఒరిస్సా, ఛత్తీస్ గడ్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రామగుండం శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నిరుపేదలు ఇక్కడి పరిశ్రమలలో ఏళ్ల తరబడి పని చేస్తున్నారని అన్నారు. వారిని గుర్తించి కులం సర్టిఫికెట్లు ఇవ్వడం ద్వారా సంక్షేమ పథకాలు ఇచ్చే వీలుంటుందని అన్నారు. అంతే కాకుండా ఆ కుటుంబాలలో ఉన్న పిల్లలు ఉన్నత చదువులు చదివే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే ఎన్టీపీసీ పరిశ్రమలోని వివిధ విభాగాలలో వేలాదిమంది కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అయితే వారికి పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్ పేరుతో 1500



వసూలు చేస్తూ నానా రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వర్కర్స్ విషయంలో అధికారులు దృష్టి సారించాలన్నారు. వారికి నార్మల్ రుసుము చెల్లించే వీలుగా అవకాశం కల్పించాలన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**జనోదయ, మందమర్రి మార్చి 26:**
విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సింగరేణి ఏరియా డీజిఎం (పర్సనల్) సిహెచ్ అశోక్ కోరారు. గురు వారం బెల్లంపల్లి పట్టణం లోని రాంజీగోండు విద్యార్థి నిలయం వనవాసి కళ్యాణ పరిషత్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు,విద్యాబోధన,విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను ఆయన పరిశీలించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి విద్యాభ్యాసం, భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో వసతులు, భోజన సదుపాయం, పరిశుభ్రతను పరిశీలించారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి, వారి సంక్షేమానికి రాంజీ గోండు విద్యార్థి నిలయం, వనవాసి కళ్యాణ పరిషత్ చేస్తున్న కృషిని ఆయన అభినందించి మాట్లాడారు.విద్యార్థులు ఉన్నత లక్ష్యాల ను నిర్దేశించుకుని లక్ష్య సాధన కోసం క్రమశిక్షణతో చదివి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్య నారాయణ, పాఠశాల గౌరవ అధ్యక్షులు కె విద్యాసాగర్, అధ్యక్షులు రంగ రామన్న, కార్యదర్శి టి సత్య నారాయణ, ముఖ్యకార్యదర్శి కాసర్ల తిరుపతి, కోశాధికారి: సూరం లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షులు ఆరేపల్లి కొమురయ్య, మహిళా మహిళా ప్రముఖ్ రాచకొండ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## జాతీయ రహదారి విస్తరణ పనులు

# వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జనోదయ, మందమర్రి మార్చి 26:**

జాతీయ రహదారి 63 విస్తరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మండలం లోని తిమ్మాపూర్ ప్రాంతంలో ఆర్మూర్ నుండి చంద్రాపూర్ జాతీయ రహదారి 63 పనులను మండల తహసిల్దార్ సతీష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన జాతీయ రహదారి విస్తరణ పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మందమర్రి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు



తీరును మండల తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగంలతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను నిబంధనలకు లోబడి చేపట్టేలా అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను, ఇతర పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డును సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. నివాసాల నుండి సేకరించిన చెత్తలో ఉపయోగకరమైన వాటిని వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



# పేదల పాలిట పెన్నిధి ఆర్‌డిటి

### ఆర్‌డిటి, ఎఫ్‌సిఆర్ఎ అనుమతికై కృషిచేసిన సీఎంకు కృతజ్ఞతలు

**జనోదయ : డి హిరేహాళ్, మార్చి 26**

అనంతపురం జిల్లా ఆశాదీపం ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్ఎ అనుమతికి విశేష కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేష్ బాబుకు, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబులు కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిలో గురువారం సాయంత్రం వారిద్దరిని వేర్వేరుగా కలుసుకుని జిల్లా ప్రజానీకం తరపున ఎమ్మెల్యేలు ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి స్థాయిలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లడం, అనంతరం మంత్రి నారా లోకేష్ బాబు పదేపదే పర్యవేక్షణ చేయటం వల్లే అనుమతులు లభించాయని కొనియాడారు. మీరు చేసిన గట్టి ప్రయత్న ఫలితమే ఈ రోజు కరువు పీడిత ప్రాంతాలకు ఆర్డిటి సేవలు కొనసాగించటానికి అవకాశం లభించిందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లా లాంటి వెనుకబడిన ప్రాంతంలో ఐదు దశాబ్దాలుగా లక్షలాది మంది పేదల జీవితాల్లో ఈ సంస్థ వెలుగులు నింపుతోందని వివరించారు. ఇది కేవలం ఒక సంస్థ సమస్య కాదని, జిల్లాలోని లక్షలాది మంది నిరుపేదల జీవన విధానంలో ఓ భాగంగా తాము భావిస్తున్నామని వెల్లడించారు. నిబంధనల అడ్డంకి కారణంగా 2021 లోనే ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ ఆగిపోయినా ఆనాటి వైకాపా పాలకులు ఏమాత్రం ఈ విషయంపై దృష్టి పెట్టలేదని తెలియజేశారు. వారి నిర్లక్ష్యం కారణంగా సేవలు కొనసాగించలేని పరిస్థితి ఆర్డిటి సంస్థకు వచ్చిందని తెలిపారు. అనుమతుల జాప్యం వల్ల సంస్థ ద్వారా



అందుతున్న ఉచిత వైద్యం, విద్య, క్రీడా, గ్రామీణ అభివృద్ధి రంగాలు పూర్తిగా ఆగిపోయే ప్రమాదం ఏర్పడిందని వివరించారు. ఈ పరిస్థితుల్లో 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఉన్న క్లిష్టమైన ఎఫ్.సి.ఆర్.ఎ నిబంధనలను అధిగమించి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించటానికి తమరు తీసుకొన్న ప్రత్యేక శ్రద్ధ, పట్టుదలను ప్రజలు ఏనాటికి మర్చిపోరన్నారు. అనంతపురం జిల్లా ప్రజల పట్ల, ముఖ్యంగా బలహీన వర్గాల పట్ల మీకున్న అపారమైన ప్రేమకు ఈ విజయం ఒక నిలువుటద్దమని వివరించారు. మీ నాయకత్వంలో జిల్లా మరింత పురోగతి సాధిస్తుందని తామంతా గట్టిగా విశ్వసిస్తున్నామని మరోసారి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వెనుకబడ్డ తరగతుల శాఖ మంత్రి సవితమ్మ పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి నుంచి నేరుగా చెత్త తీసుకునే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### కమిషనర్ శ్రీజన

**జనోదయ : శేరిలింగంపల్లి ,మార్చి 26:**

గురువారం శేరిలింగంపలి జోన్ మీటింగ్ హాల్‌లో కమిషనర్ శ్రీజన అధ్యక్షతన రివ్యూ మీటింగ్ జరిగింది. ముఖ్యంగా ఇంటి ఇంటి చెత్త సేకరణలో భాగంగా ప్రతి ఇంటి నుంచి నేరుగా చెత్త తీసుకునే కార్యక్రమాన్ని ఇంకా విజయవంతం చేయాలని నిర్ణయించారు. అదేవిధంగా కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్‌లో భాగంగా ప్రతి షాపు యజమాని ఆటో డ్రైవర్‌కు చెత్త ఇచ్చే విధంగా చేయాలని లేనిచో పెనాల్టీ విధించాలి అని నిర్ణయించారు మరియు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని సూచించారు. ఇందుకు క్షేత్రస్థాయిలో చేపట్టే పారిశుద్ధ్య చర్యలే అత్యంత ప్రధానమన్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో ఇంజనీరింగ్‌కి సంబంధించినటువంటి పలు సమస్య



లపై కూడా మాట్లాడారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు ప్రతి పనిని లోతుగా పర్యవేక్షించి అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీజన మాట్లాడుతూ ఐటీ పరిశ్రమలకు శేరిలింగంపల్లి జోన్ వేదికగా ఉన్నందున ఆ స్థాయిలోనే రహదారుల నిర్వహణ జరగాలని, క్షేత్రస్థాయి సిబ్బంది చేపట్టే చర్యలే ఇందుకు ప్రధానమన్నారు. స్వీపింగ్ అనంతరం వెంటనే చెత్త కుప్పలు తొలగించాలని, ఫ్లై ఓవర్‌లపై మట్టి ఇసుక ఇతర వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. డీసీ స్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని,లోటుపాట్లను సవరించుకుంటూ చక్కని పరిసరాలు నెలకొనేలా చూడాలన్నారు. ఈసమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ శేరిలింగంపల్లి జోన్, అపూర్వ చౌహాన్ కూకట్పల్లి జోన్, అన్ని జోన్స్‌కి సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులతో అసెంబ్లీ ముట్టడిని ఆపలేరు



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ) మార్చి 26**

నిరుద్యోగులు చేపట్టనున్న అసెంబ్లీ ముట్టడికి తెలంగాణ జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటించిన సందర్భంగా తెలంగాణ జాగృతి వరంగల్ జిల్లా ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కేతిరి సంతోష్ కుమార్‌ను ముందస్తుగా అరెస్టు చేసిన ఏనుమాముల పోలీసులు ఈ సందర్భంగా కేతిరి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలు, నిరుద్యోగులకు 4,000 జాబ్ క్యాలెండర్ నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190



# క్రైంనగర్ పోలీస్?

## చట్టాన్ని కాపాడాల్సిన ఖాకీలే ఉల్లంఘన

●స్మార్ట్ పోలీస్ అంటూ ప్రభుత్వాల ప్రయత్నాలు
●నీరుగారుస్తున్న కొందరు అధికారులు
●కరీంనగర్‌లో ఓ స్టేషన్‌లో దారుణం
●మైనర్లని పోలీస్ స్టేషన్‌లో రోజంతా కూర్చోబెట్టిన వైనం
●జువైనల్ జస్టిస్ యాక్ట్‌కి తూట్లు
●చైల్డ్ వెల్ఫేర్ శాఖకు అందిన ఫిర్యాదులు?
●చర్యలుంటాయా? వదిలేస్తారా?

**నేరాలను అరికట్టి సమాజాన్ని సత్ప్రవర్తనవైపు మళ్ళించి నేరరహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వాలు,పోలీస్ శాఖ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.ఈ క్రమంలో స్మార్ట్ పోలీసింగ్ అనే విధానాన్ని తీసుకువచ్చి ఫిర్యాదుదారులతో మర్యాదగా మసలుకోవాలని పోలీస్‌శాఖ చర్యలను తీసుకుంటోంది.నిందితులంతా నేరస్తులు కాదనే విషయాన్ని గమనంలోకి తీసుకుని చట్టబద్ధంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడంలో అనేక సంస్కరణలను తీసుకొస్తున్నారు.అయితే ప్రభుత్వాలు,పోలీస్ ఉన్నతాధికారులు ఎన్ని సంస్కరణలు చేసినా కొందరు అధికారుల మూలంగా పోలీస్‌శాఖకు చెడ్డపేరు వస్తోంది.చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే చట్టాలకు తూట్లు పొడుస్తున్న ఘటనలు నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉంటాయి. ఇలాంటి ఘటనల్లో తాజాగా కరీంనగర్ పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో చట్టవిరుద్ధ కార్యక్రమానికి అక్కడి స్టేషన్ హౌజ్ అధికారులు పాల్పడ్డట్లుగా సమాచారం.**

**బాలలను తీవ్ర మానసిక క్షోభకు గురిచేయడం అనేది వారి హక్కులకు భంగం కల్గించడంతోపాటు వారి భవిష్యత్‌ని నాశనం చేసేదే.నేరం చేశారా? లేదా అన్న విషయం తర్వాత..నేర నిరూపణ పేరుతో విచారణ పేరుతో చట్టాలను కాపాడాల్సిన స్టేషన్ హౌజ్ అధికారులే ఇలా చట్టాన్ని నిర్భయంగా,నిర్లజ్జగా ఉల్లంఘించడం పూర్తిగా శిక్షార్హమైనదే.**



నేరాలను అరికట్టి సమాజాన్ని సత్ప్రవర్తనవైపు మళ్ళించి నేరరహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వాలు,పోలీస్ శాఖ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.ఈ క్రమంలో స్మార్ట్ పోలీసింగ్ అనే విధానాన్ని తీసుకువచ్చి ఫిర్యాదుదారులతో మర్యాదగా మసలుకోవాలని పోలీస్‌శాఖ చర్యలను తీసుకుంటోంది.నిందితులంతా నేరస్తులు కాదనే విషయాన్ని గమనంలోకి తీసుకుని చట్టబద్ధంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడంలో అనేక సంస్కరణలను తీసుకొస్తున్నారు.అయితే ప్రభుత్వాలు,పోలీస్ ఉన్నతాధికారులు ఎన్ని సంస్కరణలు చేసినా కొందరు అధికారుల మూలంగా పోలీస్‌శాఖకు చెడ్డపేరు వస్తోంది.చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే చట్టాలకు తూట్లు పొడుస్తున్న ఘటనలు నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉంటాయి. ఇలాంటి ఘటనల్లో తాజాగా కరీంనగర్ పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో చట్టవిరుద్ధ కార్యక్రమానికి అక్కడి స్టేషన్ హౌజ్ అధికారులు పాల్పడ్డట్లుగా సమాచారం.

పట్టణంలో ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు బాలలను ఏదో నేరం చేశారంటూ పోలీస్ జీపులో కరుడుగట్టిన నేరస్తులను తీసుకొచ్చినట్లుగా తీసుకొచ్చి ఒకటిన్నర రోజుల పాటు స్టేషన్‌లో నిందితుల పక్కనే కూర్చుండబెట్టిన విషయం కలకలం రేపుతోంది. ఏదైనా మైనర్లు నేరం చేసినట్లుగా ఫిర్యాదులు అందే పక్షంలో మొదటగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం ఇవ్వాలి.పిల్లల వివరాలను, పేర్లను గోప్యంగా ఉంచాలని,అనంతరం బాలల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారికి కౌన్సిలింగ్ నిర్వహించి అనంతరం బాలలను బయట ప్రపంచానికి తెలియకుండా విచారించాలని జువైనల్ జస్టిస్ చట్టం చెబుతోంది. ఇక్కడ అలాంటి చట్టం ప్రకారం నడుచుకున్న దాఖలాలు ఏవీ లేవు. అయితే నేరం చేశారనే కారణంతో విచారణ పేరుతో నేరుగా పోలీస్ స్టేషన్‌కి పిల్లలను పిలిపించి ఒకటిన్నర రోజుల పాటు స్టేషన్‌లో బందించడం దారుణమే.ఈ ఘటనకు సాక్ష్యం సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాల తోపాటు సిబ్బంది అంతా సాక్ష్యాలుగా ఉన్నాయి.ఈ విషయంపై సమాచారం అందిన కొంతమంది పోలీసులను ఆరా తీయగా ఖాకీ పెద్ద సార్లకు మరింత కోపం పెరిగింది.మమ్మల్నే నిబంధనలు అడుగుతారా? మేం కూడా నిబంధనలు అంటే ఏంటో చూపిస్తామంటూ ఖాకీ పొగరును బాధితుల తల్లిదండ్రులపై చూపెట్టడం దౌర్భాగ్యం. నేరం చేశారా లేదా? అన్నది తర్వాత సంగతి.ఒకవేళ పిల్లలు నేరం చేసిన పక్షంలో నేరం తీవ్రత ఎంత? సరిదిద్దుకునే నేరమేనా? కౌన్సిలింగ్‌తో పిల్లల్లో ఆ తప్పును మరలా పునరావృతం కాకుండా చూడవచ్చా? ఒకవేళ పిల్లలను పోలీస్ స్టేషన్‌లో నిందితులుగా అందరి సమక్షంలో కూర్చుండబెడితే వారి భవిష్యత్ ఏం అవుతుంది? నేర ప్రవృత్తిని మార్చి సత్ప్రవర్తన కల పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు చట్టాల్లో బాలల పేర్లు కూడా బయట ప్రపంచానికి తెలియరాదనే నిబంధనలు రూపొందించింది.

అయితే నేరం ఇంకా నిరూపణ కాకమునుపే బాలలను విచారణ పేరిట నిందితులుగా చేసిన దారుణమైన ఘటన కరీంనగర్ పట్టణంలో చోటుచేసుకోవడం విచారకరం.ఇలాంటి ఘటన జరిగినప్పుడు అవగాహన ఉన్న ఉన్నతాధికారులైనా వెంటనే తప్పుని సరిదిద్దుకోవాల్సిందిపోయి ఇంకా ఖాకీ కాఠిన్యాన్ని చూపెట్టడం మరింత బాధాకరం.ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర బాలల సంరక్షణ శాఖకు,జిల్లా బాలల సంరక్షణ శాఖకు ఫిర్యాదులు అందినట్లుగా సమాచారం.బాలలను తీవ్ర మానసిక క్షోభకు గురిచేయడం అనేది వారి హక్కులకు భంగం కల్గించడంతోపాటు వారి భవిష్యత్‌ని నాశనం చేసేదే.నేరం చేశారా? లేదా అన్న విషయం తర్వాత..నేర నిరూపణ పేరుతో విచారణ పేరుతో చట్టాలను కాపాడాల్సిన స్టేషన్ హౌజ్ అధికారులే ఇలా చట్టాన్ని నిర్భయంగా, నిర్లజ్జగా ఉల్లంఘించడం పూర్తిగా శిక్షార్హమైనదే. వెంటనే ప్రభుత్వ పెద్దలు,ఉన్నతాధికారుల పిల్లలను పోలీస్ స్టేషన్‌లో నేరస్తుల మాదిరిగా ఉంచడంపై సంబంధిత అధికారులను విచారించి వెంటనే ఉద్యోగం నుంచి తొలగించి పోలీసులపై ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఈ ఘటనలో సంబంధిత పోలీస్ స్టేషన్ సీసీ కెమెరాలు,స్టేషన్ సిబ్బందే బలమైన సాక్ష్యాలు.నేర రహిత సమాజం కోసం ప్రతీ చోటా సీసీ కెమెరాలను అమర్చుతున్న పోలీసులు తమ పోలీస్ స్టేషన్‌లో జరిగిన చట్ట ఉల్లంఘనపై వెంటనే సీసీ కెమెరాలను చెక్‌చేస్తే అన్ని విషయాలు బయటకొస్తాయి.మరి ఆ దిశగా పోలీసు శాఖ,ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకుంటారా? లేక ఎప్పటిమాదిరిగానే బాధితుల మీదనే ఉల్టా కేసులతో వేధిస్తారా? అన్నది ఈ కేసులో మరోమారు తేలిపోతుంది.

.............

**మానసాని కృష్ణా రెడ్డి**
**సీనియర్ జర్నలిస్ట్**
**9618616110**

# బోధనాస్పత్రులు అధికారుల చేతికి..

**ఇందుకు ప్రత్యేకంగా ఓ విభాగం ఏర్పాటు**
**డాక్టర్లకు కేవలం చికిత్సలు, రోగుల బాధ్యతే**
**టీచింగ్ కాలేజీలకూ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్**
**అక్కడి ప్రొఫెసర్లు సర్జరీలు చేస్తే ఇన్సెంటివ్‌లు**
**విద్య, వైద్యానికి ఒక్క రూపాయి కూడా కోత పెట్టం**
**శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 26 :** ప్రభుత్వ ఆస్పత్రులు, వాటి అనుబంధ వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యతను గ్రూప్-1, 2 అధికారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శాసనసభలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. “పెద్ద పెద్ద చదువులు చదువుకున్న డాక్టర్లకు ఆస్పత్రుల నిర్వహణ బాధ్యతలు ఇస్తే.. ఊడ్చేవాళ్లు.. తుడిచేవాళ్లు.. మిగతా సిబ్బంది వచ్చిన్రా లేదా అని చూసుకోవడానికే సరిపోతోంది. రోగులకు చికిత్స చేయడంతోపాటు నర్సు వచ్చిందా.. వాచ్‌మెన్ వచ్చిండా.. పార్కింగ్ ఎలా ఉంది తదితరాలన్నీ చూసుకోవాల్సి వస్తోంది. వాళ్లు చదువుకున్న చదువుకు, మైండ్ సెట్‌కు, వాళ్ల వ్యవహార శైలికి ఈ బాధ్యత సరిపోదు. చికిత్సను, ఆస్పత్రి నిర్వహణను వేరు చేయాలనుకుంటున్నాం. ఇందుకు ప్రత్యేకంగా ఒక వింగ్ ఏర్పాటు చేస్తాం. ప్రత్యేకంగా గ్రూప్-1, 2 అధికారులను నియమించి నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. రోగులకు చికిత్స బాధ్యతను ప్రొఫెషనల్ డాక్టర్లకు అప్పగించాలనుంటున్నాం” అని ప్రకటించారు. వైద్యాన్ని, ఆస్పత్రుల నిర్వహణను వేరు చేయాలని అనుకుంటున్నామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ అంశంపై బీఆర్ఎస్ ఉప నేత హరీశ్ రావుతోపాటు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు గురువారం సీఎం రేవంత్ రెడ్డి జవాబిచ్చారు. “నిధుల సమస్య వస్తే ఇంకెక్కడైనా కోత విధిస్తాం. కానీ, పేదల విద్య, వైద్యం విషయంలో ఒక్క రూపాయి కూడా కోత పెట్టం. విద్య, వైద్యమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం. ప్రజలకు పోషకాహారాన్ని అందించనున్నాం. నాణ్యమైన, నైపుణ్య విద్యనూ అందిస్తాం. ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం” అని తెలిపారు. రాష్ట్రంలోని టీచింగ్ కాలేజీలకు ఆరోగ్యశ్రీ రోగులు రావడం లేదని, రోగులు వెళ్లే ఆస్పత్రుల్లో నిపుణులు లేరని, ఈ సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. టీచింగ్ కాలేజీలకు ఆరోగ్యశ్రీ రోగులను పంపించాలని భావిస్తున్నామని, అప్పుడు అక్కడి విద్యార్థులకూ మరింత అవగాహన పెరుగుతుందని తెలిపారు. టీచింగ్ ఆస్పత్రులకూ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తామని, అక్కడ చికిత్సలు చేసే ప్రొఫెసర్ డాక్టర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని భావిస్తున్నామని వెల్లడించారు. “ఆరోగ్యశ్రీ కింద 2014 నుంచి 2023 డిసెంబరు 6వ తేదీ దాకా ప్రతినెల సగటున గత ప్రభుత్వం రూ.52 కోట్లు ఖర్చు పెట్టింది. మేం గత 27 నెలలుగా ప్రతినెల రూ.89 కోట్లు ఖర్చు పెట్టాం. బకాయిల వారసత్వం వారి (బీఆర్ఎస్) నుంచే వచ్చిందే. వాళ్ల బకాయిల భారాన్ని మోస్తూనే.. ఈ పథకం కింద రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పరిమితిని పెంచాం. మేం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకూ రూ.2,408 కోట్ల చెల్లింపులు చేశాం. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.927.99 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1480.52 కోట్లు చెల్లించాం. ప్రస్తుతం రూ.727.75 కోట్ల బకాయిలున్నాయి. గత ప్రభుత్వం వదిలి వెళ్లిన బకాయిలు తీసేస్తే.. మా ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.127 కోట్లే. పాత బకాయిలను వదిలించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాం” అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. వీటిలోనూ ప్రభుత్వ ఆస్పత్రులకే రూ.496 కోట్ల బకాయిలు ఉన్నాయని, ప్రైవేట్ ఆస్పత్రుల బకాయిలు కేవలం రూ.231 కోట్లు మాత్రమేనని, ప్రైవేట్‌లో బకాయిలు తక్కువేనని చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయడం లేదనేది అపోహ మాత్ర మే అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కూడా దుర్వినియోగం చేశారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆన్‌లైన్లో



దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. 27 నెలల్లో రూ.2,046 కోట్లు సీఎం రిలీవ్ ఫండ్ కింద ఇచ్చామని, ఆరోగ్యశ్రీ కింద ఇచ్చిన రూ.2, 400 కోట్లను కలుపుకొంటే పేదల వైద్యానికి రూ.4,500 కోట్లను ఖర్చు చేశామని వివరించారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190



# ఘనంగా కొండా సుస్మిత పటేల్ జన్మదిన వేడుకలు

**-రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్**
**-మాజీ పార్లమెంట్ సభ్యులు పసునూరి దయాకర్**

**వరంగల్ జిల్లా ప్రతినిధి (జనోదయ)**

పోచమ్మ మైదాన్ జంక్షన్ లో కొండా సుస్మిత పటేల్ జన్మదిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసి మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ మాజీ పార్లమెంట్ సభ్యులు పసు నూరి దయాకర్.పోచమ్మ మైదాన్ జంక్షన్ లో కొండా సుస్మిత పటేల్ జన్మదిన సందర్భంగా భారీ కేక్ కట్ చేసి మహా అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ మాజీ పార్లమెంట్ సభ్యులు పసు నూరి దయాకర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండా సుస్మిత పటేల్ కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ జిల్లాలో పలు సాంఘిక సేవా కార్యక్రమాలు పేదలకు అండగా ఉంటూ తోచిన విధంగా సహాయం చేస్తూ.. నిత్యం ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ఉన్నారని అన్నారు. మరెన్నో జన్మదినాలు జరుపుకొని రాజకీయంగా ఎదగాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు పసునూరి దయాకర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్, టిపిసిసి కార్యదర్శి మీసాల ప్రకాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మబ్బు ప్రవీణ్, మహ్మద్ వాసిం, దామెర రాజ్ కమల్, కత్తెర శాల వేణుగోపాల్, భాషాపాక సదానందం, కార్పొరేటర్లు బసవరాజ్ కుమార్ స్వామి, సోమిశెట్టి ప్రవీణ్, బాల్నే సురేష్, మహమ్మద్ ఫుర్ఖాన్, చింతాకుల అనిల్, కావేటి కవిత, ముష్కమల్ల అరుణ, సుధాకర్, బైరబోయిన ఉమాదామోదర్ యాదవ్, భోగి సువర్ణ, సురేష్, పోషాల పద్మ స్వామి, పల్లం పద్మ రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పూసాల శ్రీనివాస్ మాజీ కార్పొరేటర్లు సీనియర్ కాంగ్రెస్ నాయకులు డివిజన్ అధ్యక్షులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## వన్య ప్రాణుల దాహం తీర్చడానికి నీటివసతి ఏర్పాటు

**జనోదయ: చెన్నూరు ఆర్సీ**

ఎండలు మండిపోతున్న ఈ వేసవిలో అడవులు, ప్లాంటేషన్ లలో సంచరించే వన్య ప్రాణుల దాహం తీర్చ డానికి తెలంగాణా అటవీ అభివృద్ధి సంస్థ (టీజీ ఎఫ్ డీసీ ) ఆధ్వర్యంలో నీరు నిల్వ ఉండేలా వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. ..వివరాల్లోకి వెళ్తే మంచిర్యాల రేంజ్ పరిధిలోని జైపూర్ మండలం ముదికుంట అటవీప్రాంతం లో టీజీ ఎఫ్ డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాంటేషన్ లలో ఒక కాలువ లో ఒక చోట నీటి ఊటను ప్లాంటేషన్ వాచర్ శంకర్ గమనించారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే టీజీ ఎఫ్ డీసీ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ దీనికి ఒక కార్య రూపం దాల్చారు. గురువారం ప్లాం టేషన్ వాచర్ శంకర్, కొంత మంది కూలీల సహాయం తో జంతువులు తాగడానికి వీలుగా నీటి ఊట నీరు వృధాగా పోకుండా కొంత మేరకు మట్టి పూడిక తీయించి అడ్డ కట్ట వేయడంతో నీరు నిల్వగా ఆగిపోయింది. ఈ సందర్భంగా ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ మూగ జీవాలైన వన్య ప్రాణులు వేసవిలో తాగు నీరు దొరకక చాలా ఇబ్బందులు పడుతుంటాయని, వాటి దాహార్తి తీర్చడం కోసం చిరు ప్రయత్నం చేసినట్లు తెలిపారు.



## మెడికల్ బోర్డును వెంటనే నిర్వహించాలి

**టిబిజికెయస్ నాయకులు**



**జనోదయ , మందమర్రి మార్చి 26:**

సింగరేణిలో ప్రతి నెలలో మూడు సార్లు మెడికల్ బోర్డు నిర్వహిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తన హామీని నెరవేర్చాలని తెలంగాణ బొగ్గు గాని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు మేడిపల్లి సంపత్ డిమాండ్ చేశారు. బాయి బాటలో బాయ్ బాట కార్యక్రమంలో భాగంగా గురువారం వర్క్ షాప్ లో టీబీజీకేఎస్ నాయకులు కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు నిర్వహించకుండా మెడికల్ బోర్డు ఎత్తివేసేందుకు కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించి కార్మికుల వారసులకు కారుణ్య నియమాకాలు కల్పించాలన్నారు. కార్మికుల సొంతిం టి కల నెరవేర్చాలని పెర్క్స్ పై ఆదాయం పన్నును సింగరేణి యజమాన్యమే భరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఓ రాజశేఖర్, తోట రాజిరెడ్డి, కొండల్ రావులు పాల్గొన్నారు.

# వరద కాలువలో గోదారమ్మ పరవళ్ళు

**ఫలించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి**
**రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపు హౌస్ నుండి వరద కాలువకు నీటిని విడుదల చేసిన అధికారులు**

**జనోదయ : గంగాధర మార్చి 26:**

గంగాధర మండలం కొండన్నపల్లి వద్ద వరద కాలువలో పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు చొప్పదండి నియోజకవర్గం లో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా చివరి మడి వరకు సాగునీరు అందించి కాపాడుకుంటామని తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం. రెండు రోజుల క్రితం రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిని కలిసి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వరద కాలువకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుండి అధికారులు వరద కాలువకు నీటిని విడుదల చేశారు. పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడడానికి గోదారమ్మ వరద కాలువలో పరవళ్ళు తొక్కింది. చొప్పదండి నియోజకవర్గం రైతులకు భరోసా కల్పిస్తూ వరద కాలువ నిండుగా ప్రవహించింది. దీంతో కొండన్నపల్లి కురిక్యాల గ్రామాల మధ్య వరద కాలువ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. వరద కాలువలో పసుపు, కుంకుమ, పువ్వులు చల్లి గోదారమ్మకు స్వాగతం పలికారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సకాలంలో వరద కాలువకు నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమాళ్ళ మనోహర్, సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, సర్పంచులు రేండ్ల శ్రీనివాస్, రామిడి రాజిరెడ్డి,బీర్ల ఆనందం, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, కాదరి హరికకనకయ్య,గునుకొండ బాబు,లింగాల లింగయ్య, గుడి రజిని ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్,దానే అనసూర్య ఒదేలు, లావణ్య తిరుపతి, బాబ లక్ష్మి మధు, కవిత మల్లేశం,దుబ్బాసి బుచ్చయ్య,మేర్గ కొండయ్య,మ్యాక వినోద్, తదితరులు పాల్గొన్నారు.

